నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, గురువారం 31 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర, నాయకులు, కార్యకర్తలు

బీఆర్ఎస్.. పవర్ జోష్

మధిర : కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

ఇల్లెందు : పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- విద్యుత్ చార్జీల పెంపునకు బీఆర్ఎస్ చెక్ పెట్టినందుకు సంబురాలు
- ఉమ్మడి జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకాలు
- ప్రధాన సెంటర్లలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టిన బీఆర్ఎస్ శ్రేణులు

ఖమ్మం, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచాలన్న ప్రతిపాదనకు సిద్ధమైన ప్రభుత్వ ప్రయత్నాలకు బీఆర్ఎస్ అడ్డుకట్ట వేయడాన్ని స్వాగతిస్తూ.. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం సంబురాలు చేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఈఆర్‌సీ) ఎదుట తమ వాదనలు బలంగా వినిపించి చార్జీలు పెరగకుండా.. భారం పడకుండా చేసిన బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచిందని పలువురు నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి.. టపాకులు కాల్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు బెల్లం వేణు, బిచ్చాల తిరుమలరావు, ఉబ్బలపల్లి నిరోషా, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు. మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో సీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు.

రేగాకు స్వీట్లు తినిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో టపాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. మధిర పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, ఎర్రుపాలెం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. పాల్వంచ పట్టణంలో బీఆర్ఎస్ నాయకుడు మంతపురి రాజుగౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. కారేపల్లి మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

కేసీఆర్ చరిత్రను చెరిపే దమ్ము ఎవరికీ లేదు

- తెలంగాణ ఉన్నంతవరకు కేసీఆర్ సజీవుడే..
- బీఆర్ఎస్ పోరాటం ద్వారానే విద్యుత్‌చార్జీల పెంపు ఉపసంహరణ
- రూ.18,500 కోట్ల భారం ప్రజలపై పడకుండా ఆపిన ఘనత బీఆర్ఎస్‌దే..
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, అక్టోబర్ 30 : వెయ్యిమంది రేవంత్‌రెడ్డిలు వచ్చినా తెలంగాణ నుంచి కేసీఆర్‌ను తుడిచి వేయలేరని, తెలంగాణ ఉన్నంతవరకు కేసీఆర్ అనే వ్యక్తి సజీవంగా నిలిచి ఉంటారని, కేసీఆర్‌ను ఇంచుకూడా కదిలించడం ఎవరితరం కాదని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి తాతా మధు మాట్లాడారు. కేటీఆర్‌ను అడ్డుపెట్టుకుని కేసీఆర్ అనే వ్యక్తిని లేకుండా చేశానని, హరీశ్‌రావును అడ్డం పెట్టుకుని కేటీఆర్‌ను లేకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి పగటికలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం అంటే ఏమిటో తెలియని రేవంత్ కేసీఆర్ చరిత్రను లేకుండా చేయడమంటే తెలంగాణ రాష్ట్రాన్ని లేకుండా చేయడమేనని, ఒకవేళ తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతాడేమోనని అనుమానం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్‌కు త్యాగాల గురించి ఏమి తెలుసునని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు చేసిన కృషి ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం పడకుండా ఆగిందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ డిస్కంలకు ఆదేశాలు ఇచ్చిందని, దానిని ఎదుర్కొనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజలపై ఏ విధంగా భారం పడుతుందో లెక్కలతో సహా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు వివరించడం జరిగిందని, ఫలితంగా ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా కాపాడమని, ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ విజయమే అన్నారు. కాంగ్రెస్ పార్టీ 11నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రేవంత్‌కు నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో అతితక్కువ సమయంలో ప్రజా వ్యతిరేకత పొందిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకే మంత్రులు కొండా సురేఖ, పొన్నం, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఇదంతా కాంగ్రెస్ నాయకుల వ్యూహం అన్నారు. రేవంత్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, కాంగ్రెస్ పాలన భ్రష్టు పట్టిందని తాతా మధు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులకు జైళ్లు కొత్తకాదని, పోరాటం కొత్తకాదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసే వరకు ఊరుకోమని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పష్టతలేదన్నారు. గన్నీ బ్యాగులు అందించలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధాన్యం ప్రైవేటు వ్యాపారులు రూ.1,500లకు కొంటున్నారన్నారు. అన్నిరకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇండ్లు నిర్మించుకొని పూర్తికాని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని అన్నారు. వివిధ స్టేజీల్లో ఉన్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని సండ్ర అధికారులను కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, జర్పుల లక్ష్మణ్, పాశబోయిన వీరన్న, పాలేపు రామారావు, వీరూ నాయక్, పగడాల నరేందర్, సతీష్, దొడ్డా శ్రీనివాసరావు, కూసంపూడి రామారావు, కట్టా అజయ్ కుమార్, దుగ్గిరాల వెంకట్‌లాల్, కాటమనేని వెంకటేశ్వరరావు, పోట్ల శ్రీను, శీలంశెట్టి వీరభద్రం, కొండబాల వెంకన్న, రాంరెడ్డి, వెంకట్రావ్, యాగంటి శ్రీనివాసరావు, వీరమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్య వెలుగుల దీపావళి

- నేడు దివాళి పర్వదినం
- పటాకుల దుకాణాల వద్ద సందడి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 30 : దివ్య వెలుగుల దీపావళి పండుగను ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. అమావాస్య చీకట్లను పారద్రోలేందుకు ఇంటి ముందు దీపాలను వెలిగించడం ఆనవాయితీ. జీవితాల్లో కష్టాలనే చీకట్లను పారద్రోలి సంతోషాలను నింపుకునేందుకు దీపావళి పండుగ మంచి అర్థాన్ని ఇస్తుందని పలువురు చెబుతుంటారు. దీపావళి నాడు మహిళలు, యువతులు రంగురంగుల ముగ్గులు వేసి అందులో దీపాలు వెలిగించడంతోపాటు యువకులు, చిన్నాపెద్దా అందరూ కలిసి ఇంటి వాకిళ్లలో క్రాకర్స్, పటాకులు కాల్చి కమ్ముకున్న కారుచీకట్లను పారద్రోలుతారు. ఇది ప్రజల నమ్మకం. ఈ పండుగ నాడు కొంతమంది నోములు చేయడం ఆనవాయితీ. ఇందుకోసం రకరకాల బొమ్మలను తెచ్చి బొమ్మరిల్లును తయారు చేసుకొని నోములు చేసుకుంటారు. అదేవిధంగా పితరులకు బియ్యం పెట్టడం కూడా ఆనవాయితీ. కార్మిక ప్రాంతాల్లో కచ్చితంగా దీపావళి నాడు శ్మశానవాటికల్లో కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లి తమ ఆప్తుల సమాధుల వద్ద వారికి ఇష్టమైన వంటలు పెట్టి అక్కడే దీపాలు వెలిగించి పటాకులు కాలుస్తుంటారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో విధంగా పండుగను జరుపుకుంటారు.

కొణిజర్ల : పటాకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రముఖుల శుభాకాంక్షలు..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని, ఈ పండుగ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఉన్నారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

ఖమ్మంలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

'సర్వే' విజయవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. వచ్చే నెల 6 నుంచి మొదలయ్యే సర్వేలో భాగంగా బుధవారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ఐడీవోసీ సమావేశ మందిరంలో బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్షల మంది జీవితాల్లో మార్పు తీసుకొస్తుందన్నారు. సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, వివరాలను సేకరించాలన్నారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్య, ఇంటి నంబర్, ఇంటి యజమాని పేరు, రేషన్, ఆధార్ కార్డు తదితర వివరాలు ఫారంలో నమోదు చేయాలని సూచించారు. ఇంటి సర్వే పూర్తికాగానే వివరాలతో నింపిన స్టిక్కర్‌ను ఇంటి గోడపై అతికించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈవో చంద్రశేఖర్, సీపీవో సంజీవరావు పాల్గొన్నారు.

ధాన్యం కేటాయింపునకు బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి

- రైస్‌మిల్లులో తాలు పేరుతో కోతలు పెట్టొద్దు..
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రైస్‌మిల్లర్లు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, అక్టోబర్ 30 : జిల్లాలోని రైస్‌మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేసేందుకు బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరి అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వరి ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారెంటీపై మిల్లర్లు, బ్యాంక్ అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా రైస్ మిల్లులకు బ్యాంకు గ్యారెంటీ ఆధారంగా కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఎటువంటి బకాయిల చరిత్రలేని మిల్లర్లు, మిల్లింగ్ సామర్థ్యంపై 10శాతం బ్యాంకు గ్యారెంటీ, 25శాతం సెక్యూరిటీ డిపాజిట్, గతంలో బకాయిలు ఉండి సకాలంలో పెనాల్టీతో సహా చెల్లించిన మిల్లర్లు 20శాతం బ్యాంకు గ్యారెంటీ, 25శాతం సెక్యూరిటీ డిపాజిట్, వందశాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీతో డిఫాల్ట్ ఉన్న మిల్లర్లు 25శాతం బ్యాంకు గ్యారెంటీ, 25శాతం సెక్యూరిటీ డిపాజిట్ చూపెట్టాల్సి ఉంటుందన్నారు. మిల్లుల వద్ద తాలు పేరుతో ఎటువంటి కోతలు విధించడానికి వీలులేదని అన్నారు. రైస్‌మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. మిల్లుల వద్ద ఉన్న గన్ని బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు త్వరగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ వివాదం వెనుక ఉద్దేశమేమిటో..!

- అర్బన్, రఘునాథపాలెం రెండింటిలో ఒక్కదానికే డీడీవో కోడ్
- అర్బన్ ఎంఈవో బాధ్యతలు స్వీకరించొద్దని డీఈవో మౌఖిక ఆదేశాలు
- ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులతో బాధ్యతలు చేపట్టిన శైలజాలక్ష్మి

ఖమ్మం, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి పోస్టు వివాదాస్పదంగా మారింది. డీడీవో(డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) కోడ్ లేదని కారణం ఒకటి కాగా, ఆ మండలానికి ఎంఈవో పోస్టే లేదనేది మరో కారణంగా వినిపిస్తున్నది. పూర్తి వివరాల్లోకెళ్తే.. జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. గతంలో అర్బన్ మండలంగా ఉన్న దానిని రెండు మండలాలుగా చేసి ఒకటి అర్బన్, మరోటి రఘునాథపాలెంగా మార్చారు. మండలంలో పనిచేసే ప్రతి విభాగంలో ఉన్న అధికారి ఎంపీడీవోకి రిపోర్ట్ చేయాలి. దీంతో రఘునాథపాలెం మండలానికి ఎంపీడీవో పోస్టు ఉంది, అర్బన్‌కి ఎంపీడీవో పోస్టు లేదనే దానితో రఘునాథపాలెం మండలానికి ఎంఈవో పోస్టు, అర్బన్‌కు ప్రత్యేకంగా ఎంఈవో పోస్టు ఉండదనే వాదన వినిపిస్తుంది. ఎంఈవోలు 9, 10వ తరగతికి సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు, ఇతరత్రా చేయాలన్నా డీడీవో కోడ్ ఉండాలి. ఇదే డీడీవో కోడ్ చుట్టూ ఎంఈవో పోస్టు వివాదం నడుస్తున్నది. అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో ఒక్కదానికి మాత్రమే డీడీవో కోడ్ ఉంది. గతంలో అర్బన్ ఎంఈవోకు ఉన్న డీడీవో కోడ్ ఇప్పుడు ఎంపీడీవో లేడు కాబట్టి అది రఘునాథపాలెంకి వర్తిస్తుందని, మరికొందరు అర్బన్‌కే డీడీవో కోడ్ ఉంది. రఘునాథపాలెంకి లేదని విద్యాశాఖాధికారులు విభిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నారు.



ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన శైలజాలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాస్వామి

విధుల్లో చేరొద్దని మౌఖిక ఆదేశాలు

విదేశాల నుంచి తిరిగి వచ్చిన శైలజాలక్ష్మి ఈ నెల 24న పాఠశాలలో హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించేందుకు డీఈవోకి సమాచారం ఇవ్వగా.. కొంత సమయం వేచి ఉండాలని డీఈవో సోమశేఖర శర్మ సూచించారు. దీంతో గురు, శుక్రవారాలు వేచి ఉన్నారు. శనివారం బాధ్యతలు స్వీకరించేందుకు సన్నద్ధమవ్వగా ఉన్నతాధికారుల నుంచి సమాచారం లేదని చెబుతూ డీఈవో విధుల్లో చేరొద్దని ఆమెకు మౌఖిక ఆదేశాలిచ్చారు.

బాధ్యతలు చేపట్టిన శైలజాలక్ష్మి..

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించేందుకు మండల నోడల్ ఆఫీసర్లనే ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులిచ్చారు. ఆయా మండలాల్లో సీనియర్లుగా ప్రధానోపాధ్యాయులను(ఎంఎన్‌వో)లను ఎంఈవోలుగా నియమిస్తూ సెప్టెంబర్ 24న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో భాగంగా ఖమ్మం అర్బన్ ఎంఈవోగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా, అర్బన్ ఎంఎన్‌వోగా ఉన్న శైలజాలక్ష్మిని నియమించారు. అప్పటికే ఆమె ఉన్నతాధికారుల అనుమతితో అమెరికా వెళ్లారు. దీంతో ఇన్‌చార్జిగా రఘునాథపాలెం ఎంఈవో రాములుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె విదేశాల నుంచి ఈ నెల 24న వచ్చి స్కూల్‌లో హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శనివారం అర్బన్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించి డీఈవో, ఆర్జేడీ, విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఆర్జేడీకి రిపోర్ట్ చేశాం..

సెలవు అనంతరం హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టేందుకు అనుమతించాం. అర్బన్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆర్జేడీ నుంచి అనుమతి రాలేదు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకునే వరకు రెండు రోజులు ఆగాలని వరంగల్ ఆర్జేడీ సూచనలను వివరించాను. అనుమతి రాకపోయినా విధుల్లో చేరడంతో ఆ రిపోర్ట్‌ను ఆర్జేడీకి నివేదించాం.

– సోమశేఖర శర్మ, డీఈవో

ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులతో చేరా..

అర్బన్ ఎంఈవోగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వుల ఆధారంగానే అర్బన్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించాను. విధుల్లో చేరొద్దని అధికారికంగా ఏమి ఇవ్వలేదు. హెచ్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఈవోని కలిసి పరిస్థితిని వివరించాం.

– శైలజాలక్ష్మి, ఎంఈవో, ఖమ్మం అర్బన్